క్లుప్తంగా

ఇద్దరు నాయకులకు ఎమ్మెల్యే తాటిపర్తి పరామర్శ


వెంకటేశ్వరరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి

పెద్దారవీడు: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన మండలంలోని గొబ్బూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, బత్తుల కాశయ్యలను ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, సర్పంచ్‌లు అంగిరేకుల ఆదినారాయణ, గుడ్డెపోగు రమేష్, నాయకులు తోకల ఆవులయ్య, షేక్ బుజ్జి, కార్యకర్తలు ఉన్నారు.

పోలేపల్లి పాఠశాల తనిఖీ


ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ-2 అమీర్‌బాషా

దొనకొండ: మండలంలోని పోలేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను మండల విద్యాధికారి-2 షేక్ అమీర్‌బాషా శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనం పరిశీలించారు. తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం రిజిస్టర్లు తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం తయారు చేయాలని కుకింగ్ నిర్వాహకులకు సూచించారు. పాఠశాలను ప్రశాంతంగా ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదే అన్నారు. పలు సూచన, సలహాలు ఉపాధ్యాయులకు ఎంఈఓ అందజేశారు. ఆయన వెంట సీఆర్‌పీలు ఉన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు


దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

త్రిపురాంతకం: ఎరువులు, పురుగుమందుల డీలర్లు నకిలీ క్రిమి సంహారక మందులు అమ్మకాలు జరిపినా, బిల్లులు రికార్డులు సక్రమంగా నిర్వహించకున్నా చర్యలు తప్పవని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు డి.బాలాజీనాయక్, మండల వ్యవసాయాధికారి కె.నీరజ హెచ్చరించారు. మండలంలోని మేడపిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సూచనలు చేశారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. తప్పనిసరిగా నిబంధనలకు లోబడి మాత్రమే షాపులు నిర్వహించాలని, లేకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు.

సబ్సిడీపై శనగ విత్తనాలు


సబ్సిడీ శనగలు ఇస్తున్న ఏఓ బాలకృష్ణనాయక్

దర్శి: సబ్సిడీపై శనగ విత్తనాలు రబీ పంట కాలంలో సాగు చేసుకునేందుకు ఇస్తున్నట్లు ఏఓ వి.బాలకృష్ణనాయక్ తెలిపారు. మండలంలోని శామంతపూడిలో 81 క్వింటాళ్ల శనగ విత్తనాలు సబ్సిడీపై ఇచ్చారు. క్వింటా ధర సాధారణ మార్కెట్‌లో రూ.9,400 ఉండగా రైతుల వద్ద రూ.7050 కట్టించుకుని రైతులకు అందజేశామన్నారు. విత్తనాలు పొందిన ప్రతి రైతు రబీ కాలానికి సంబంధించి పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. గ్రామ సహాయకులు డి.అరుణ, రైతులు పాల్గొన్నారు.

ఆమె డెంగీతో మృతి చెందలేదు


మాట్లాడుతున్న మలేరియా అధికారి శ్రావణ్‌కుమార్

ముండ్లమూరు (దర్శి): ముండ్లమూరు మండలం పసుపుగల్లులో షేక్ గౌషాని డెంగీతో మృతి చెందలేదని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వి.శ్రావణ్‌కుమార్ నిర్ధారించారు. మండలంలోని పసుపుగల్లులో శుక్రవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ మృతురాలి కుటుంబ సభ్యులకు అవగాహన లేక డెంగీ అని చెప్పి ఉంటారన్నారు. వైద్యులతో గ్రామంలో పర్యటించి రోగాల గురించి వాకబు చేశారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్యంపై వాకబు చేశారు. పీహెచ్‌సీ వైద్యులు ఎం.జమీన్, నారాయణరావు, మలేరియా యూనిట్ అధికారి నర్రావుల బసవారెడ్డి, పి.సుబ్బారావు పాల్గొన్నారు.

అందని ద్రాక్షలా
పశువులకు పరిహారం

- వివిధ ప్రమాదాల్లో చనిపోతున్న పశువులు
- విద్యుత్ షాక్‌తో మరణిస్తే నో పరిహారం
- పోస్టుమార్టం నివేదికతో దరఖాస్తు చేసుకోవాలి
- అవగాహన లేక నష్టపోతున్న పశుపోషకులు

పుల్లలచెరువు: ఊహించని విద్యుత్ ప్రమాదాలు, వర్షాలు, తుఫాన్‌ల సమయంలో ప్రమాదవశాత్తు పశువులు విద్యుత్ షాక్‌కు గురవుతుంటాయి. దీంతో రూ.లక్షల విలువ చేసే పాడి గేదెలు, పశువులు అక్కడికక్కడే మృత్యువాత పడిన దాఖలాలు అనేకం. వర్షాలు, ఈదురు గాలులు, తుఫాన్‌ల సమయంలో విద్యుత్ తీగలు తెగిపడుతుంటాయి. కొన్ని పశువులు ప్రాణాలు కోల్పోతుండగా చాలా పశువులు గాయాలపాలవుతున్నాయి. ఇలాంటి ప్రమాదాల్లో నష్టపోయిన బాధిత కుటుంబాలకు విద్యుత్ శాఖ పరిహారం అందించి ఆదుకుంటుంది. ఈ పరిహారంపై బాధితులకు అవగాహన లేకపోవడంతో చాలామంది పశుపోషకులు నష్టపోతున్నారు.


కవలకుంట్లలో విద్యుత్ షాక్‌తో మృతి చెందిన గేదె

దరఖాస్తు ఇలా చేసుకోవాలి

విద్యుత్ ప్రమాదం జరిగిన వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి. కేసు నమోదయ్యాక పశుకళేబరానికి పోస్టుమార్టం చేయించాలి. పరిహారం పొందేందుకు కేసుకు సంబంధించిన పత్రాలతో విద్యుత్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. డెత్ సర్టిఫికెట్, ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టం నివేదిక, బ్యాంక్ అకౌంట్ తదితర కాపీలను జతచేసి విద్యుత్ శాఖ ఏఈకి అందించాలి. ఏఈ ప్రాథమిక స్థాయిలో దర్యాప్తు చేస్తారు. దరఖాస్తుతో పాటు తన నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు పంపిస్తారు. ఆ పత్రాలు ఉన్నతాధికారులకు అందిన తర్వాత, మంజూరైన నష్టపరిహారం బాధితుల బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది. పశువులు విద్యుత్ షాక్‌కు గురై మరణిస్తే ముందుగా సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు, వీఆర్వో, తహసీల్దార్‌కు సమాచారం అందించాలి. పశువైద్యాధికారి నుంచి పశువు ఖరీదు తెలిపే పత్రం, మరణ ధ్రువీకరణ పత్రం తీసుకోవాలి. మృతి చెందిన పశువు విలువ ఆధారంగా, నిబంధనలను అనుసరించి లెక్కిస్తారు. ఆ మేరకు బాధిత రైతుకు నష్టపరిహారం దక్కుతుంది.

పోస్టుమార్టం తప్పనిసరి: విద్యుత్‌షాక్‌తో పశువులు మరణిస్తే వెంటనే సమీప పోలీసుస్టేషన్‌లో రైతు ఫిర్యాదు చేయాలి. ఎఫ్ఐఆర్ ఉంటే పశువైద్యాధికారి పోస్టుమార్టం చేస్తారు. ఆ నివేదికలో సంబంధిత పశువు మరణానికి విద్యుత్ షాక్ కారణమని తేలితే ఆ మేరకు నివేదిక అందిస్తారు. ఈ రెండింటినీ తీసుకెళ్లి విద్యుత్ శాఖ అధికారులకు అందించాలి. వారు దర్యాప్తు చేసి పరిహారం అందిస్తారు.

డాక్టర్ నాగుల్‌మీరా, పశువైద్యాధికారి, పుల్లలచెరువు


అర్హులకు మాత్రమే పరిహారం: ప్రమాదవశాత్తు లేదా విపత్తుల సమయంలో విద్యుత్ షాక్‌కు గురై పశువులు మరణిస్తే పోలీసు ఎఫ్ఐఆర్ కాపీ, పశువైద్యుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఈ రెండింటినీ విద్యుత్ శాఖ అధికారులకు అందజేయాలి. మేం విచారణ చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం. ఉన్నతాధికారుల ఆమోదం మేరకు నష్టపరిహారం బాధితులకు అందజేస్తాం.

పి.కిశోర్, విద్యుత్ శాఖ ఏఈ, పుల్లలచెరువు

పడకేసిన పారిశుధ్యం


ప్రధాన మురుగు కాలువలో చెట్లు పెరిగి నిలిచిన మురుగు


మురుగు పేరుకుని పచ్చంగా మారిన వీధి కాలువ


కాలువలు లేక రోడ్డు పక్కన పారుతున్న మురుగు

- పసుపుగల్లులో ఎక్కడి మురుగు అక్కడే
- కంపు కొడుతున్న కాలువలు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పసుపుగల్లులో పారిశుధ్యం పడకేసింది. గ్రామంలో మురుగునీరు విలయ తాండవం చేస్తోంది. మురుగు నీరు వెళ్లే దారిలేక సైడు కాలువల్లో ఎక్కడి మురుగు అక్కడే పేరుకుపోతోంది. రోజు రోజుకూ దోమలు ప్రబలి గ్రామంలో ప్రజలు వ్యాధుల భారిన పడుతున్నారు. సైడు కాలువల నుంచి నీరు ప్రధాన కాలువల్లోకి వచ్చి ఊరి బయటకు వెళ్లే మార్గంలో నీరు ముందుకు కదలక గ్రామంలోనే నిల్వ ఉంది. కాలువలు చెత్త చెదారం, మురుగు నీటితో నిలిచిపోయాయి. కాలువల్లోనే చిల్లచెట్లు పెరిగి మురుగు నీరు బయటకు వెళ్లక పోవడంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోంది. నెలలు తరబడి గ్రామంలో పారిశుధ్య పనులు చేయడం లేదు. ఇటీవల కురిసిన వర్షాలకు కాళీ స్థలాల్లో మురుగు పేరుకుపోవడం, దోమలు ప్రబలి నిద్ర లేని రాత్రులు గడుపుతున్నారు. గ్రామంలో ఫాగింగ్ కొట్టి కాలువలు శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు. బ్లీచింగ్ వంటి క్రిమిసంహారక మందులు చల్లి ప్రజలకు వ్యాధులు దరి చేరకుండా చర్యలు తీసుకోవాలని పసుపుగల్లు గ్రామస్తులు కోరుతున్నారు. గ్రామంలో వీధిలైట్లు కూడా లేవు. ఎక్కడా వీధిలైట్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

ఇంటింటికీ జ్వరపీడితులే

ఇంటింటికీ జ్వరాలు వస్తూ పోతూ ఉన్నాయని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. గురువారం డెంగీలో మహిళ మృతి చెందిందన్న విషయం తెలియడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఇంటింటి సర్వే చేసి గ్రామంలో జ్వరాల నియంత్రణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని గ్రామస్తులు కోరుతున్నారు.


దుర్గంధం వెదజల్లుతున్న కాలువ

నిరుపేదలకు నిత్యావసరాల పంపిణీ

తాళ్లూరు: మండలంలోని దారంవారిపాలెంలో నిరుపేద కుటుంబాలకు దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులైన దారంవారిపాలెంలో 30 నిరుపేద కుటుంబాలకు 15 రకాల నిత్యావసరాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. సచివాలయ గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి డి.సుశీల మాట్లాడుతూ డీడీఆర్‌సీ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆధార్, రేషన్ కార్డులు పొంది ప్రభుత్వ పథకాల్లో భాగస్వామ్యం కావాలని సూచించారు. బిడ్డలను విధిగా చదివించాలని, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. డిజిటల్ అసిస్టెంట్ డి.రవీంద్రబాబు, గ్రామ పెద్దలు నాగులూరు స్వామియేలు, కోటయ్య, మరియమ్మ పాల్గొన్నారు.


నిత్యావసరాలు అందుకుంటున్న పేద మహిళలు

దోమలు ప్రబలకుండా ఫాగింగ్

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడులో ప్రజలకు దోమల బారి నుంచి రక్షించేందుకు సర్పంచ్ కోట శివలక్ష్మి ఫాగింగ్ కొట్టించారు. మురుగు కాలువల్లో బ్లీచింగ్ చల్లించారు. గ్రామంలో మురుగు తీయించి వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. సర్పంచ్ చేస్తున్న పనులపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


దోమల నివారణకు చేస్తున్న ఫాగింగ్

కొనసాగుతున్న ఆక్రమణల తొలగింపు

పొదిలి: స్థానిక పాతూరులోని రథం రోడ్డు, కొత్తూరులోని కాలేజీ రోడ్డులో సైడు కాలువలపై ఆక్రమణల తొలగింపు కొనసాగుతోంది. అధికారులు ఈ తొలగింపు ఎందుకు చేపడుతున్నారో అర్థం కాని అయోమయంలో తామున్నామని పట్టణ ప్రజలు వాపోతున్నారు. ప్రధాన రహదారిలో తొలగింపుల తర్వాత ట్రాఫిక్ సమస్య మరింత జటిలం అయిందే తప్ప పరిష్కారం కాలేదని వాహనదారులు చెబుతున్నారు. ఆక్రమణల తొలి రోజు ఆనందపడి, అంతా తమ ఘనతేనని చెప్పుకున్నవారు నోట మాట రాక ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం కూడా చెప్పడం లేదు. కాలేజీ రోడ్డులో మాత్రం ట్రాఫిక్ సమస్య మరింత పెరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతోంది. ఇంతకు ముందుగా దుకాణాల దగ్గర సైడు కాలువపై ద్విచక్ర వాహనాలు నిలిపేవారు. ఇప్పుడు రోడ్డుపై నిలపాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రూ.10 లక్షలతో నిర్మించిన సైడు కాలువలు ధ్వంసం

రథం రోడ్డులోని రైస్ మిల్లు ఎదురుగా రూ.10 లక్షలతో ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ అధికారుల ఆధ్వర్యంలో సైడు కాలువలు నిర్మించారు. ఆ కాలువను కూడా జేసీబీలతో ధ్వంసం చేశారు. ఇంజినీరింగ్ అధికారులు పక్కా లెక్కలతో కట్టిన కాలువలు కూడా ఎందుకు ధ్వంసం చేస్తున్నారో అర్థం కావడం లేదని గృహ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సైడు కాలువలపై ఆక్రమణల తొలగింపులో పక్షపాతం చూపించవద్దని, రోజు వారి రోడ్డు పక్కన వ్యాపారాలు చేసుకునే వారికి ఉపాధి మార్గం చూపించాలనే విన్నపాలను పట్టించుకోవడం లేదని పలువురు మండిపడుతున్నారు.


విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డులో శిథిలాలు

పశుగణన ప్రారంభం

కురిచేడు: మండలంలోని 11 సచివాలయాల్లో పశుగణన ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా తీసుకోవడంతో పశుగణన ఈసారి పక్కాగా నిర్వహించాలని పశువైద్యాధికారులు సిబ్బందిని ఆదేశించారు. కొందరు ఆహోలు ఉన్నతాధికారుల ఆదేశాలను సైతం లెక్క చేయకుండా పశుగణన ప్రారంభించలేదు. కొందరైతే కాకి లెక్కలు చూపే ప్రయత్నం చేస్తున్నారు. ఈసారి జరిగే పశుగణన గతంకన్నా భిన్నంగా ఉండబోతుందని పశువైద్యశాఖ సిబ్బంది చర్చించుకుంటున్నారు.


పశుగణన చేస్తున్న ఆహో

12 మంది జూదరుల అరెస్టు

ముండ్లమూరు (దర్శి): మండలంలోని పోలవరం గ్రామంలో పేకాటాడుతున్న 12 మందిని ఎస్సై నాగరాజు తన సిబ్బందితో కలిసి శుక్రవారం అరెస్ట్ చేశారు. గ్రామంలోని బ్యారన్ పక్కన ఓ రేకుల షెడ్డులో పేకాటాడుతున్నట్లు సమాచారం అందడంతో వెంటనే సివిల్ డ్రస్‌లోనే సిబ్బందితో కలిసి వెళ్లిన ఎస్సై.. వారిని పట్టుకుని వారి వద్ద ఉన్న రూ.8,300 నగదు స్వాధీనం చేసుకున్నారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

పెద్దారవీడు: రైతులు ప్రత్యామ్నాయ పంటలను ఎక్కువ శాతం సాగు చేయాలని వ్యవసాయాధికారి కె.బుజ్జిబాయి తెలిపారు. మండల పరిధిలో బోయిదగుంపుల, తోకపల్లి, చట్లమిట్ల గ్రామ రైతు సేవా కేంద్రాల్లో పొగాకు పంటకు ప్రత్యామ్నాయ అపరాల సాగుపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. ఆమె మాట్లాడుతూ పొగాకు సాగు చేస్తే గాలి, వాతావరణం, నీరు కలుషితం అవుతుందని, భూమి ఆరోగ్యం ఎక్కువ దెబ్బతింటుందని చెప్పారు. పొగాకు వాడితే క్యాన్సర్, గుండె జబ్బులు, శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. మానవాళికి హానికర పొగాకు పంటను తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు రైతులు దృష్టి పెట్టాలన్నారు. ప్రత్యామ్నాయంగా శనగ, మినుము, బొబ్బర్లు, ఉలవలు వంటి పంటలు సాగు చేస్తే తక్కువ పెట్టుబడితో ఎక్కువ నికర ఆదాయం పొందే అవకాశం ఉంటుందన్నారు. వీఏఏలు ప్రేమ్‌కుమార్, రామాంజనేయులు, రఫీ, రైతులు పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న ఏఓ బుజ్జిబాయి

విద్యార్థుల సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

పుల్లలచెరువు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారిలో సామర్థ్యాలను మెరుగుపర్చేలా చూడాలని ఎంఈఓ ఇందిర ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలో బీసీ కాలనీ పాఠశాలను ఆమె తనిఖీ చేశారు. ముందుగా పాఠశాలలో రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అనంతరం విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యా వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా ఉపాధ్యాయులు బోధన చేయాలన్నారు. చదవడం, రాయడం నేర్పించడంతో పాటు సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలన్నారు. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ విద్యార్థుల్లో మార్పులు వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మధ్యాహ్న భోజనం అందజేయాలన్నారు.


విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ ఇందిర

సీజనల్ వ్యాధులతో జాగ్రత్తగా ఉండాలి


సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: మండల ప్రజలు పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి రమేష్‌బాబు సూచించారు. సీజనల్ వ్యాధులు, కాన్సర్ తదితర వ్యాధులపై మండల పరిధిలోని గంటవానిపల్లెలో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు ప్రబలే అవకాశం ఉన్నందున గ్రామాల్లో డెంగీ, డయేరియా, మలేరియాతో పాటు విషజ్వరాలు, అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. నీటి తొట్లు, టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా సూపర్‌వైజర్ కందుల ఇశ్రాయేల్, కొర్రప్రోలు సూపర్‌వైజర్ రాఘువేంద్రరావు, బాలగురవమ్మ పాల్గొన్నారు.

ముందస్తు చర్యలతో అధిక దిగుబడులు

ముండ్లమూరు (దర్శి): ముందస్తు చర్యలతో అధిక దిగుబడులు సాధించ వచ్చని వ్యవసాయాధికారి మహ్మద్ ఫరూక్ అన్నారు. మండలంలోని జమ్మలమడకలో ప్రస్తుత పంట సాగుపై శుక్రవారం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మహ్మద్ ఫరూక్ మాట్లాడుతూ నారు నాటే ముందు నారు కొసలు తుంచి నాటుకుంటే కాండం తొలిచే పురుగుగుడ్లు నివారించుకోవచ్చన్నారు. రైతులు రబీలో పొగాకు బదులుగా మొక్కజొన్న, శనగ, మినుము వంటి ఆహార పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్న రబీ సాగులో కత్తెర పురుగు ఆశించే అవకాశం ఎక్కువగా ఉందన్నారు. విత్తనాలు ముందుగానే విత్తన శుద్ధి చేసుకోవాలని సూచించారు. ఎకరాకు 10 లింగాకర్షక బుట్టలను మొక్క మొలిచిన 10 రోజుల్లోపు అమర్చాలన్నారు. కత్తెర పురుగు గుడ్లు గమనించిన వెంటనే లీటరు నీటికి 1500 పీపీఎం వేపనూనె 5 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలని సూచించారు. వ్యవసాయ సహాయకులు రాధామణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఏఓ మహ్మద్ ఫరూక్

ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ పోరాటం


ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కమిటీ సభ్యులు

త్రిపురాంతకం: ఉపాధ్యాయుల సమస్యలపై యూటీఎఫ్ పోరాటం చేస్తోందని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు వీరారెడ్డి పేర్కొన్నారు. యూటీఎఫ్ మండల మహాసభ శుక్రవారం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల పక్షాన యూటీఎఫ్ పనిచేస్తోందన్నారు. సమస్యలు ఉన్నవారు స్థానిక యూనియన్‌కు తెలియజేస్తే అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. అమరజీవి చెన్నుపాటి లక్ష్మయ్య ఆశయాలు కొనసాగించాలన్నారు. నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కె.మల్లారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా, గౌరవ అధ్యక్షుడిగా కె.లక్ష్మణమూర్తి, కోశాధికారిగా ఎస్‌కే అజీమ్ ఎన్నికయ్యారు. ఎంఈఓలు కె.తులసి మల్లికార్జున నాయక్, టి. రాజశేఖరరెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం చేసింది. పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులను సన్మానించారు.